




# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

## ఆదిలాబాద్

మంచిర్యాల
నిర్మల్ - కొమరం భీం
ఆసిఫాబాద్

బుధవారం 17 సెప్టెంబర్ 2025 పేజీలు 06


### ప్రజా పాలన దినోత్సవ వేడుకలను

# ఘనంగా నిర్వహించాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ఆసిఫాబాద్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

నేడు తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో నిర్వహించనున్న తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్‌రావుతో కలిసి పోలీస్, రెవెన్యూ,పంచాయితీ రాజ్,వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖల అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని తెలిపారు. ( మిగితా..2లో )

### వరద ప్రభావిత ప్రాంతాలపై సమావేశం నిర్వహించిన కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్,సూర్య మేజర్ న్యూస్**

ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఏర్పడిన వరద ప్రభావిత ప్రాంతాల్లో దెబ్బతిన్న రహదారులు, తదితర వాటి పరిస్థితి పై సమీక్షించేందుకు మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా మున్సిపాలిటీ , నీటిపారుదల శాఖలతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వరదల ప్రభావంతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణంగా పరిష్కరించేందుకు తాత్కాలిక, శాశ్వత చర్యల పై సుదీర్ఘంగా అధికారులతో చర్చించారు.ముఖ్యంగా మావల చిన్న చెరువు, ఖానాపూర్ ట్యాంక్ నుండి నీరు మితిమీరిన నేపథ్యంలో ఏర్పడిన సమస్యలను కలెక్టర్ సవివరంగా అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా నీటిపారుదల,మున్సిపాలిటీ శాఖల



అధికారులను సంయుక్తంగా ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, తగిన ప్రతిపాదనలను సిద్ధం చేసి వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమర్పించాలని ఆన్నారు.ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు కలెక్టర్ కువివరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీన్ రాజు, ఇరిగేషన్ అధికారి విఠల్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ మాత, శిశు ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ

# చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ ప్రతినిధి,సెప్టెంబర్16, సూర్య మేజర్ న్యూస్ :**




### రైతులకు అవసరమైన మేరకు

# యూరియా పంపిణీ

● వ్యవసాయ సాగుకు అవసరమైన మేరకు యూరియా పంపిణీ చేసేందుకు చర్యలు ● రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదు ● ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు ● విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు ● వ్యక్తిగత పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించాలి ● జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో వ్యవసాయ సాగుకు అవసరమైన మేరకు యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి సుధాకర్‌తో కలిసి రైతులతో మాట్లాడారు. వ్యవసాయ సాగుకు అవసరమైన మేరకు యూరియా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భీమారం మండలంలో గత సంవత్సరం 14 మెట్రిక్ టన్నుల యూరియా వినియోగించబడిందని, ఈ సంవత్సరం ఇప్పటికే 11 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా మండలంలో అవసరం ఉన్న ప్రకారం 3, 4 రోజులలో ( మిగితా 2లో )

### సీజనల్ వ్యాధుల పట్ల

# అప్రమత్తంగా ఉండాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్ ప్రతినిధి,సెప్టెంబర్ 16,సూర్య మేజర్ న్యూస్**

సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్



భవన సమావేశ మందిరంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌లతో జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు చేపట్టవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధులు అయిన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధులు అయిన డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోజుకు 400 లకు పైగా వివిధ వైద్య సేవల నిమిత్తం రోగులు వస్తుంటారని, అందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు నిర్వహించి పాజిటివ్ కేసులను గుర్తించాలని,చిన్న కారణాలతో ఇతర ప్రాంతాలకు రోగులను పంపించడం సరికాదని, వారికి ఇక్కడే వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రతి రోజు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న రోగులు, వారికి అందిస్తున్న వైద్య సేవలు, వైద్య పరీక్షలలో పాజిటివ్ వచ్చిన కేసుల వివరాలను ప్రతిరోజు అందించాలని తెలిపారు. స్టాఫ్ నర్సుల వివరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్య సేవల కొరకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, రీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు పాల్గొన్నారు.

# విద్యా రంగ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్






**మంచిర్యాల,సూర్య మేజర్ న్యూస్ :**

విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వ చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, సామాగ్రి భద్రపరచు గది, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా మధ్యాహ్నం భోజనంలో మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. ( మిగితా..2లో )

సూర్య www.suryaa.com



## ప్రభుత్వ మాత, శిశు ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ మాత, శిశు ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మహిళా శక్తి క్యాంటీన్‌ను పరిశీలించిన కలెక్టర్, భోజనం నాణ్యత, పరిశుభ్రతపై వివరాలు సేకరించారు. అనంతరం లాబొరేటరీ, స్కానింగ్ కేంద్రం, ఇన్‌వార్డు, అవుట్‌వార్డు, ఆపరేషన్ థియేటర్, ఓపి వార్డు, బాలింతల వార్డులను సందర్శించి రోగుల పరిస్థితి, అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వైద్యులకు పలు సూచనలు చేస్తూ గర్భిణీలకు, బాలింతలకు ప్రత్యేక వైద్య సేవలు సమయానికి అందించాలన్నారు. ప్రసవాల సమయంలో ఎటువంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోగులతో మృదువుగా, శ్రద్ధగా వ్యవహరించి, అవసరమైన మందులు ఎల్లప్పుడూ



అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణం శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజూ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి రోగుల విశ్వాసాన్ని నిలబెట్టాలని కలెక్టర్ సూచించారు.ఈ తనిఖీలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, ఆసుపత్రి పర్యవేక్షకులు సరోజ, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి
### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**మొదటి పేజీ తరువాయి...**



వేడుకల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు.వేడుకలలో భాగంగా జిల్లా అభివృద్ధిపై సందేశం ఇస్తారని, కార్యక్రమానికి వచ్చే వారికి త్రాగునీరు, అల్పాహారం, నీడ, ఇతర అవసరమైన ఏర్పాట్లు చేయాలని, పాత్రికేయులకు ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయాలని, వేదిక అలంకరణ, పోడియం, సౌండ్ సిస్టం ఏర్పాటు చేయాలని తెలిపారు. పారిశుద్ధ్య పనులు, నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతో పాటు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అంబులెన్స్, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వాహనాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రముఖులను ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించాలని, కలెక్టరేట్ లో పనిచేసే అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొనాలని, ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా రంగ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు
### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మొదటి పేజీ తరువాయి...**

విద్యార్థుల ఆరోగ్యం పట్ల పర్యవేక్షిస్తూ ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు



పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యమైన నిత్యవసర సరుకులు, తాజా కూరగాయలను వినియోగించాలని, వంట సిబ్బంది పరిశుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలలో పారిశుద్ధ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అవసరమైన మేరకు యూరియా పంపిణి

**- వ్యవసాయ సాగుకు అవసరమైన మేరకు యూరియా పంపిణీ చేసేందుకు చర్యలు - రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదు - ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు - విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు - వ్యక్తిగత పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించాలి - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మొదటి పేజీ తరువాయి...**




ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీలలో యూరియా అందుబాటులో ఉంచడం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న యూరియాను వ్యవసాయ సాగుకు మాత్రమే వినియోగించాలని తెలిపారు. మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తుందని, ఈ క్రమంలో నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, సామాగ్రి భద్రపరచు గది, పరిసరాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా మధ్యాహ్నం భోజనంలో మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడం జరుగుతుందని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యమైన నిత్యవసర సరుకులు, తాజా కూరగాయలను వినియోగించాలని, వంట సిబ్బంది పరిశుభ్రత నిబంధనలు పాటించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పాఠశాల పరిసరాలలో పారిశుద్ధ నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. 6వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి ప్రశ్నలు అడిగి



వారి అభ్యాసన సామర్థ్యాలను పరీక్షించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి నదిలో నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి
### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,సెప్టెంబర్16, సూర్య మేజర్ న్యూస్ :**



ఎక్కువ ప్రాంతాల నుండి గోదావరి నదిలో నీరు చేరుతున్న దృష్ట్యా నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల గోదావరి నది తీర ప్రాంతాన్ని మండల తహసిల్దార్ రఫతుల్లా తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాలలో వర్షం కురుస్తున్నందున ప్రాజెక్టుల నుండి వరద నీరు గోదావరి



నదిలోకి చేరుతుందని, ఈ నేపథ్యంలో నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ఇందు కొరకు పోలీస్, మున్సిపల్ శాఖల నుండి సిబ్బందిని నియమించి గోదావరి నది తీర ప్రాంతంలో నీటి పరిస్థితిని పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ ను ఆదేశించారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో కొనసాగుతున్న ఇందిరా మహిళ భవన్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు గుత్తేదారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై
## అప్రమత్తంగా ఉండాలి
### - ఎస్సై ఉపేందర్ రావు

**నస్పూర్, సెప్టెంబర్ 16, సూర్య మేజర్ న్యూస్:**

డ్రగ్స్, సైబర్ నేరాలపైఅవగాహన కలిగి ఉండాలని సీసీసీ నస్పూర్ ఎస్ఐ. ఉపేందర్ రావు అన్నారు. సోమవారం పోలీస్ స్టేషన్ పరిధిలోని, సంఘం మల్లయ్య పల్లిలో పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో, అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, గంజాయి, డ్రగ్స్, మత్తు మందులు, గుట్కాలు ప్రమాదకరమన్నారు. ప్రజలు, యువత సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. గుర్తు తెలియని వారికి వ్యక్తిగత సమాచారాన్ని అందించవద్దని సూచించారు. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి, మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని, అప్రమత్తంగా ఉండాలన్నారు.బ్యాంక్ ఖాతా, ఏటీఎం పిన్ నెంబర్లు, ఓటీపీ వివరాలు చెప్పవద్దన్నారు.మోసగాళ్లు మీకు ఏదయినా ఆశచూపిస్తే వాటికి ఆకర్షితులు కావొద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోలీ నెంబర్ 1930కు కాల్ చేయాలని సూచించారు. వ్యక్తిగత ఫొటోలను డీపీలుగా పెట్టుకోవద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు డ్రైవింగ్ చేయవద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. మాదవ ద్రవ్యాల వినియోగం వల్ల సామాజిక, మానసిక, శారీరక, అనారోగ్యాలు తలెత్తుతాయన్నారు. మాదక



ద్రవ్యాల వినియోగం వల్ల మీ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎజాజ్, బ్లూ కోడ్ అశోక్, నాగరాజు, కాంగ్రెస్ నాయకులు గుమ్మడి తిరుపతి, సదానందం, బిజెపి శ్రీరాంపూర్ జోన్ ప్రధాన కార్యదర్శి సదయ్య, కళ జాత బృందం తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపులు
## అన్ని రంగాల్లో ఎదగాలి

**- జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య**
**- ఇచ్చోడలో సంఘ భవనం నిర్మాణం కోసం కృషి**
**- మున్నూరు కాపుల ఆధ్వర్యంలో సన్మానం**



**ఇచ్చోడ, సూర్య మేజర్ న్యూస్.**

మున్నూరు కాపులు అన్ని రంగాల్లో ఎదగాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లె పూల నర్సయ్య అన్నారు. మున్నూరు కాపులు హక్కుల సాధన కోసం ఉద్యమించాలన్నారు. మండల కేంద్రమైన ఇచ్చోడలో మంగళవారం మున్నూరు కాపు మండల శాఖ తరుపున స్థానిక భవనంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్‌తో పాటు, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, బోథ్ మాజీ ఎంపీటీసీ, సామా జిక కార్యకర్త చట్ల ఉమేష్ లకు శాలువాలు, పూల మాలతో ఘనంగా సన్మానించి, సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్తానిక సంస్థగత ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం,సీఎం రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, మన మున్నూరు కాపులు ఏ పార్టీలలో ఉన్నా కలిసి కట్టుగా 42 శాతం బీసీ రిజర్వేషన్ల పెంపుకు మద్దతు ఇవ్వాలన్నారు. స్థానిక ఎన్నికల్లో మున్నూ రు కాపులు సత్తా చాటాలని, దానికి గాను కృషి చేయాలన్నారు.మున్నూరుకాపులు వ్యవసాయం,విద్య,రాజకీయ, ఉపాధి, వ్యాపారంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనీ స్పష్టం చేశారు.అనంతరం బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, బోథ్ మాజీ ఎంపీటీసీ, సామాజిక కార్యకర్త చట్ల ఉమేష్ మాట్లాడారు. ఇచ్చోడలో సంఘ భవనం నిర్మాణం,రూ 20 లక్షల నిధుల మంజూరు కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. మున్నూరు కాపులు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. త్వరలోనే బోథ్ తాలూకా మున్నూరు కాపు కార్యవర్గం ఎన్నిక ఏర్పాటు కోసం కృషి చేస్తున్నామని వారు చెప్పారు.అందరి అభిప్రాయాలతో, విధివిధానాలు తయారు చేస్తున్నామని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో మండల కో ఆర్డినేటర్ నరాల రాజేశ్వర్, యం డిఎఫ్ మండల కన్వీనర్ బలగం రవితో పాటు ఇచ్చోడ, గెర్జం,కోకస్ మన్నూర్, మాదాపూర్ గ్రామాలకు చెందిన అధ్యక్షులు,అయిద రాజేశ్వర్,జుగ్రేవార్ దీపక్,కాండ్లి విశ్వనాథ్, సుధాకర్,అంగ రాజేశ్వర్,నరాల రమణయ్య, దేశెట్టి రాజేశ్వర్, మల్లికార్జున్, బలుగురి గంగయ్య, సిద్గిరి



దత్తు, బలగం రవి, ఆసం మనోహర్, సిద్దవార్ వెంకటేష్, చందు, కొండ హరి ప్రసాద్, ముప్పతి శంకర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బంధువుల ఆగడాల నుండి రక్షించండి కాపాడండి
### - తమకు వారి నుంచి ప్రాణ హాని ఉంది.

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 16, సూర్య మేజర్ న్యూస్:**

బంధువుల ఆగడాల నుంచి తమ కుటుంబానికి ప్రాణ రక్షణ కల్పించాలని భీమిని మండలం మల్లిడి గ్రామపంచాయతీ దుబ్బ గూడెం గ్రామానికి చెందిన తండ్రి, కొడుకులు పెద్దపల్లి వెంకటేశం, పెద్దపల్లి ప్రశాంత్ పోలీసు లను వేడుకుంటున్నారు. మంగళవారం రోజున బెల్లంపల్లి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 48 లో 30 ఏళ్లుగా సాగు చేస్తున్న తమ రెండెకరాల లావని పట్టా భూమిలో తమ పెదనాన్నలు పెద్దపల్లి శంకరి, పెద్దపల్లి రామయ్య, వీరి కుమారులు పెద్దపల్లి నగేష్, పెద్దపల్లి సురేష్, పెద్దపల్లి గణేష్ లు ఇటీవల




దౌర్జన్యంగా వచ్చి బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అనేకసార్లు అప్పటి భీమిని ఎస్సై వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసిన పట్టించుకోక పోగా తనపైనే రౌడీషీట్ పెట్టారని పెద్దపల్లి ప్రశాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమే బెల్లంపల్లిలో ఏసీపీని సంప్రదిస్తే తనపై ఆరు తప్పుడు కేసులు పెట్టినట్లు తెలిసిందని ప్రశాంత్ పేర్కొనారు. తన తాత ఉమ్మడి వారసత్వంగా సంక్రమించిన భూమి లో పంపకాలు కాకుండానే ఇంటి నిర్మాణం చేపడుతుంటే అడ్డుకోబోయిన తనపై దాడి చేసి గాయపరిచారని తెలిపారు. తాను పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేయగా భీమిని ఆసుపత్రిలో చికిత్స చేశారని తెలిపారు. తాను ఎన్నిసార్లు పోలీసులను న్యాయం కోసం వేడుకున్న పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు చేసిన వారికే పోలీసులు వత్తాసు పలుకుతున్నారన్నారు. తమ పై దాడి చేసిన తన పెదనాన్న పెద్దపల్లి శంకర్ అతని కుమారు లపై పోలీసులు చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. సర్వేనెంబర్ 46 లో గల తమ వ్యవసాయ భూమిలో తాము వేసుకున్న పత్తి చేనుపై పెద్దపల్లి గణేష్ లు గడ్డి మందు పిచికారి చేయడంతో పత్తి పంట నష్టపోయానని ఈ విషయంలో పోలీసులు తగు విచారణ జరిపి దోషులపై చర్యలు తీసుకొని తమ కుటుంబానికి న్యాయం చేయాలని పెద్దపల్లి ప్రశాంత్, అతని తండ్రి పెద్దపల్లి వెంకటేశం లు వేడుకున్నారు.

## లింగాపూర్ గ్రామ గౌడ సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక

**కడెం, సూర్య మేజర్ న్యూస్ :**



కడెం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన గౌడ సంఘం ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకున్నారు. లింగాపూర్ గౌడ సంఘం అధ్యక్షుడిగా బొంగు చిన్న వెంకన్న, కోశాధికారిగా పంజాల రాజు గౌడ్, కమిటీ సభ్యులుగా గుగ్గిళ్ళ బుచ్చ గౌడు, పెగ్గర్ల రామ గౌడ్, బొంగు లక్ష్మీపతి, మర్రిపల్లి రమేష్, పెగ్గర్ల రామ గౌడ్, బట్టి నారాయణ గౌడ్,గాజర్ల రాజేశ్వర్గౌడ్, కవ్వాల బక్కన్న,పెగ్గర్ల నారాయణ గౌడ్, భజగోని రాజ గౌడు, ఎన్నుకున్నారు. గౌడ సంఘం అధ్యక్షుడు బొంగు చిన్న వెంకన్న మాట్లాడుతూ, గౌడ సంఘ అభివృద్ధికి దోహదపడతానని, ఎవరికి ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని తెలిపారు.

## ఎస్పీ అఖిల్ మహాజన్‌కి కృతజ్ఞతలు తెలిపిన సైబర్ బాధితుడు

**- సైబర్ బాధితుడికి పది రోజుల్లో తిరిగి 41,800 అందేలా చర్యలు**

**ఆదిలాబాద్,సెప్టెంబర్ 16,సూర్య మేజర్ న్యూస్**

రిక్షా కాలనీకి చెందిన రాథోడ్ సునీల్ ఈనెల గత సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌కి తన అకౌంట్‌లోకి రావలసిన 41 వేల 800 రూపాయలను వేరే అకౌంట్‌లోకి వెళ్లిన సందర్భం పై ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సంఘటనపై జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సైబర్ బృందానికి బాధితునికి తిరిగి రావాల్సిన డబ్బులపై సూచనలు చేయగా, కడప సైబర్ క్రైమ్ బృందానికి సంప్రదించి తన అకౌంట్‌లోకి రావాల్సిన డబ్బులను తిరిగి వచ్చే విధంగా కృషి చేయడం జరిగింది.



ఈ సందర్భంగా బాధితుడు రాథోడ్ సునీల్ జిల్లా ఎస్పీకి నేడు శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. సైబర్ క్రైమ్ పై స్పందించి వెంటనే స్పందించి తనకు న్యాయం చేసిన జిల్లా పోలీసు యంత్రాంగానికి ఎంతగానో కృతజ్ఞతలు అంటూ జిల్లా ఎస్పీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ పి గోపి కృష్ణ, సిబ్బంది రియాజ్, త్రిశూల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల స్థాయిలోనే
## ఉన్నత విలువలకై స్టూడెంట్స్ కౌన్సిల్ ఏర్పాటు

**కడెం, సెప్టెంబర్ 16,సూర్య మేజర్ న్యూస్:**

తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ ఆదేశాల మేరకు మండలంలోని లింగాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో స్టూడెంట్స్ కౌన్సిల్ ఏర్పాటు చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట రమణ తెలిపారు. పాఠశాలలో చురుకుగా ఉండే 44 మంది విద్యార్థులను ఎంపిక చేసి పాఠశాల కౌన్సిల్ ఏర్పాటు చేశామని ఉపాధ్యాయులు తెలిపారు. స్టూడెంట్స్ కౌన్సిల్ వలన విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండి క్రమశిక్షణ విలువలు విద్యాభివృద్ధి జీవన నైపుణ్యాలు మెరుగవుతాయని అన్నారు. ఈ సందర్భంగా ఎంపిక అయిన విద్యార్థులచే ప్రధానోపాధ్యాయులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఇందులో ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.




## తహసీల్దార్‌కు ఆదివాసీ సంఘాల వినతిపత్రం

**- లంబాడీలు, సుగాలీలకు ఎస్టీ సర్టిఫికెట్లు ఇవ్వవద్దని డిమాండ్**
**- ఆదివాసీ హక్కులను దోచుకుంటున్న వలస గిరిజనాలపై ఆగ్రహం**

**సిరికొండ, సెప్టెంబర్ 15 సూర్య మేజర్ న్యూస్,**

సిరికొండ మండల కేంద్రంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివాసీ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు.



తుడుం దెబ్బ మండల అధ్యక్షులు కుమరం యాదవ్ రావు, విద్యార్థి సంఘం గౌరవ అధ్యక్షులు సిడం నాగోరావ్, మండల విద్యార్థి సంఘం అధ్యక్షుడు పెందుర్ మహేంద్ర ఆధ్వర్యంలో తహసీల్దార్ తుకారాం కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వలస వచ్చిన బంజారాలు, లంబాడీలు, సుగాలీలు తెలంగాణలో ఎస్టీలుగా చలామణి అవుతూ ఉద్యోగాలు, భూములు, నిధులు, నియామకాలు వంటి అన్ని రంగాల్లో ఆదివాసుల హక్కులను అన్యాయంగా దోచుకుంటున్నారని విమర్శించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 ప్రకారం 1976లో ఎస్టీ జాబితాలో చేర్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తూ అక్రమంగా లబ్ధులు పొందుతున్నారని ఆరోపించారు. కాబట్టి తహసీల్దార్ కార్యాలయం లంబాడీలు, సుగాలీలకు ఎస్టీ సర్టిఫికెట్లు జారీ చేయకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నగేష్, ప్రధాన కార్యదర్శి సిడం వినోద్, అమృత్ రావ్, మాజీ సర్పంచ్ కుమరం రఘురాం మాజీ సర్పంచ్ పెందుర్ అనిల్ కుమార్, మేస్రం హనుమత్, గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### దోమల దండయాత్ర పై
## గ్రామ పంచాయితీ సిబ్బంది దాడి

**వాంకిడి, సెప్టెంబర్ 16,సూర్య మేజర్ న్యూస్**

మండలంలోని ఇందిరానగర్ కాలనీలో డ్రై డే కార్యక్రమం క్రమంలో నీరు




నిలిచిన ప్రాంతాల్లో మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టారు. నీటి నిల్వలపై బయో ద్రావణ మందు పిచికారీ చేయడంతో పాటు ఆయిల్ బాల్స్ వదిలారు.వర్షపు నీరు నిలిచే ప్రదేశాల్లో దోమల పెరుగుదల చెందే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,వాటిని తొలగించే చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.ఇలాంటి డ్రై డే కార్యక్రమాలు ప్రతి వారం నిరంతరంగా చేపడతామని గ్రామపంచాయతీ అధికారులు తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో ఈ చర్యలు మరింత ప్రభావవంతంగా అమలవుతాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, ఏఎన్ఎం రుక్మిణి, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మురికి నీరు దారి మళ్లింపు

**ఖానాపూర్ టౌన్ సెప్టెంబర్ 16 సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని బొడ్డోనికుంట లోనికి వస్తున్న మురికి నీటిని, మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది దారి మళ్లింప చేసినారు. కుంటలోనికి మురికి నీరు రాకుండా చూడాలని ప్రజలు చేసిన విజ్ఞప్తి మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు సిబ్బంది తెలిపినారు.



## తెలంగాణ విలీన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి..సిపిఐ నాయకులు

**మందమర్రి, సెప్టెంబర్ 16, సూర్య మేజర్ న్యూస్.**

తెలంగాణ విమోచన దినోత్సవం సెప్టెంబర్ 17 ను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యు లు భీమనాధుని సుదర్శన్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎఐటియుసి ఏరియా బ్రాంచ్ కార్యదర్శి



సలేంద్ర సత్యనారాయణ, సిపిఐ పట్టణ కార్యదర్శి కామెర దుర్గారాజ్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను పట్టణంలోని ఎఐటీయుసీ యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సిపిఐ పార్టీ జెండాను సిపిఐ పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజు ఆవిష్కరించి, అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ), సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం నిజాం నవాబులకు వ్యతిరేకంగా జమీందారు జాగీర్దాలు దేశముఖ్ భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో దొడ్డి కొమురయ్య తొలి అమరుడయ్యారని అన్నారు. భువనగిరిలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర మహాసభ ద్వారా తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపు ఇచ్చి నాయకత్వం వహించిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్ లు గేరిల్లా దళాలను ఏర్పాటు చేసి మూడు వేల గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూమిని పంచిన చరిత్ర సిపిఐ పార్టీకే దక్కు తుందన్నారు. సాయుధ పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టులు ప్రాణాలను వదిలారని, వారి ఉద్యమ స్ఫూర్తిగానే హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో సెప్టెంబర్ 17న విలీనం చేసి నిజాం నవాబులు వెళ్లిపోవారిని వారు స్పష్టం చేశారు. కేంద్రంలోనీ బిజెపి ప్రభుత్వం తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందూ ముస్లిం మద్య జరిగిన పోరాటంగా వక్రీకరిస్తూన్నారని, తెలంగాణ రైతంగ సాయుధ పోరాటంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ లు పాల్గొన లేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాట విలీన దినోత్సవాన్ని ప్రభుత్వపరంగా అధికారికంగా నిర్వహించాలని సాయుధ పోరాట చరిత్రను, అమరవీరుల త్యాగాలను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని వారు కోరారు. సెప్టెంబర్ 11 నుండి 17 వరకు గ్రామ, పట్టణ, మండల కేంద్రాలలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తూ సాయుధ పోరాట చరిత్రను అమరవీరుల త్యాగాలను ప్రజలకు వివరించడం జరుగుతుందని, సెప్టెంబర్ 17 ముగింపు సభ హైదరాబాద్ లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియం లో నిర్వహిస్తున్నామని, ఈ ముగింపు సభకు పార్టీ ప్రజా సంఘాల శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బండారి రాజేశం, జెట్టి మల్లయ్య, బియ్యాల పద్మ, ఏఐటియుసి నాయకులు సిహెచ్పి శర్మ, మర్రి కుమార స్వామి, జి సుదర్శన్ రెడ్డి, సివి రమణ, ఎగ్గేటి రాజేశ్వరరావు, మస్క భూమయ్య, ఎం వెంకటేశ్వర్లు, సీపిఐ మున్సిపాలిటీ బస్తీ నాయకులు ఎండి రసూల్, జక్కనబోయిన సమేందర్, తాళ్లపల్లి వీరన్న, గజ్జల గోపాల్, పిట్టల రవి, గడ్డం సంతు, జి గోవర్ధన్, జంజీరాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రజెండా నీడలోనే "సాయుధ పోరాటం"

**- తెలంగాణ సాయుధ పోరాట యోధుల్ని మరిచి హిందూ, ముస్లింల పేరుతో బిజెపి రాద్ధాంతం - సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న పాలకులు - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణి శంకర్**

**ఆసిఫాబాద్ ప్రతినిధి, సూర్య మేజర్ న్యూస్.**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఘనంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు స్థానిక బస్టాండ్ ముందర సిపిఐ జెండాను జిల్లా కార్యదర్శి బద్రి సాయి కుమార్ ఎగురవేయగా అనంతరం ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట సర్వ హక్కులు సిపిఐ పార్టీకే దక్కుతాయని, దానికి పేటెంట్ తామేనని, ఎర్ర జెండా నీడలోనే సాయుధ పోరాటం జరిగిందని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం జరగడానికి అనేక కారణాలు ఉన్నాయన్నారు. ఆనాడు ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేదని, నైజాం ముఖాలు చేరి ప్రజలను చిత్రహింసలకు గురి చేసేవారన్నారు. ఈ క్రమంలోనే ఆంధ్ర మహాసభ ఏర్పడి విరోచిత పోరాటాలు చేస్తూ 10లక్షల ఎకరాల భూముల్ని ప్రజలకు పంచడం జరిగిందన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఇంతటి ఘన పోరాటం జరగలేదని. దేశానికి స్వాతంత్రం వచ్చిన తెలంగాణకు స్వాతంత్రం రాలేదని, తెలంగాణతో పాటు కర్ణాటకలోని మూడు, మహారాష్ట్రలోని ఐదు జిల్లాలతో కలిసి తెలంగాణ హైదరాబాద్ సంస్థానం ఉండేదన్నారు. నాడు నైజాం నవాబు చేతిలో ఉండగా ప్రత్యేక దేశంగా ప్రకటించుకునే ప్రయత్నం జరిగిందన్నారు. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, సోయాబుల్లాఖాన్, వంటి అనేక మంది పోరాటం ఫలితంగా హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడం జరిగిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం హిందువులకు వ్యతిరేకంగా జరిగిందని బిజెపి దొంగ మాటలు మాట్లాడుతుందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న బందగి, సోయాబుల్లాఖాన్, లాంటి వారు ముస్లింలే కదా




అని అన్నారు. అసలు బిజెపి ఆనవాళ్లు అప్పుడేమైనా ఉన్నాయా అని ఎద్దేవా చేశారు. పోరాట యోధుల విగ్రహాలను హైదరాబాద్ ట్యాంక్ బండ్ పై ప్రతిష్టించాలని, పాఠ్య పుస్తకాల్లో తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను లిఖించాలని డిమాండ్ చేశారు.పాలకుల తీరు మారానందున సామాజిక ప్రజా తెలంగాణ కోసం మరో పోరాటానికి యువత సిద్ధంగా ఉండాలని, హిందూ,ముస్లిం తగాధాలు పెట్టే వికృత ఆగడాలను ఎదిరించాలని అన్నారు.

సిపిఐ సీనియర్ నాయకులు బద్రి సత్యనారాయణ మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని కోరారు. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ నైజాం పై పోరాటాన్ని హిందూ, ముస్లింల గొడవగా చిత్రీకరిస్తున్నదని అన్నారు. నాటి పోరాటంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాత్ర ఏ మాత్రం లేదని, సాయుధ పోరాటానికి వారసులు ఒక్క కమ్యూనిస్టులేనని అన్నారు. భూస్వాములకు, దోపిడీ దారులకు నైజాం సర్కారు అండగా ఉండడం వల్లనే నైజాం సర్కారు పై సాయుధ పోరాటానికి సిపిఐ పిలుపునిచ్చిందన్నారు.. నాటి పోరాటంలో దొడ్డి కొమరయ్య మొదలుకొని నాలుగున్నర వేల మంది వీరులు అమరులయ్యారని, నేడు తెలంగాణలో గ్రామ గ్రామాన నాటి నెత్తుటి ఆనవాళ్ళు ఉన్నాయని అన్నారు. బీజేపీ కు తెలంగాణ విలీన దినోత్సవంపై మాట్లాడే హక్కు లేదన్నారు. నాలుగున్నర వేల కమ్యూనిస్టు అమరుల త్యాగాలతో ఎర్రబారిన తెలంగాణ నేల..నిజాం నిరంకుశ పాలనను కూలదోసింది కమ్యునిస్టులే. పటేల్ సైన్యం కాదు.తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన రద్దయ్యింది. పటేల్ సైనిక చర్య వల్ల కాదు. 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంచి, 3 వేయిల గ్రామాలను విముక్తి చేసింది కమ్యూనిస్టులే.పటేల్ చీకటి ఒప్పంద ఫలితమే నిజాం రాజుకు గవర్నర్ పదవి.తెలంగాణ సాయుధ పోరాటాన్ని మరియు అమర వీరులను స్మరించుకుందాం వారి ఆశయ సాధనకు ప్రతిజ్ఞ చేద్దాం.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని మరియు అమరుల జీవిత చరిత్రలను.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యాంశాలుగా చేర్చాలి అని వారన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి భోగే ఉపేందర్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పిడుగు శంకర్, రాయిల్లా నర్సయ్య, కోదురుపాక మహేష్,బావునే వికాస్,వర్కోల్ రాకేష్,సీపీఐ అసిఫాబాద్ మండల కార్యదర్శి నాయిని వెంకటేష్, సీపీఐ టౌన్ కార్యదర్శి అజయ్,రాజశేఖర్,వి శ్రీకాంత్,జె. విష్ణు తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ అసమర్ధతతోనే

## రైతులకు యూరియా కష్టాలు

**సారంగాపూర్,సెప్టెంబర్ 17,సూర్య మేజర్ న్యూస్**

ప్రభుత్వ అసమర్ధతతోనే రైతులకు యూరియా కష్టాలు ఏర్పడ్డాయని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎకిలేరి భోజన్న అన్నారు.పంట



చేనులలో ఉండాల్సిన రైతులు యూరియా కోసం పడిగాపులు కాయాల్సి వస్తుందని,కెసిఆర్ హయంలో ముందు చూపుతో రైతులకు యూరియా కొరత లేకుండా చూసుకున్నారని, ఇప్పుడైనా అధికార పక్ష నాయకులు మేల్కొని రైతులకు యూరియాను సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.రైతుకు నాలుగు బస్తాల అవసరం ఉంటే ఒకటి లేదా రెండు బస్తాలతో సరి పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందని,పెట్టుబడులు పెట్టిన రైతులకు యూరియా సమయానికి అందకపోతే దిగుబడులు రాక నష్టపోతారని ప్రభుత్వం తక్షణమే యూరియా కొరత లేకుండా రైతులకు అవసరం మేర యూరియాను అందించాలని డిమాండ్ చేశారు.

## అంగన్వాడి సెంటర్లలో పోషణ్ భీ. పడాయ్ భీ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి - ఐసిడిఎస్ సిడిపిఓ శ్రీలత

**కడెం, సెప్టెంబర్ 16,సూర్య మేజర్ న్యూస్ :**

మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పోషణ్ భీ. పడాయ్ భీ కార్యక్రమంపై 3 రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా కడెం మండలంలోని పెద్ద బెల్లాల్ రైతు వేదికలో కడెం, దస్తురాబాద్ 2 మండలాల అంగన్వాడీ టీచర్లకు ఐసిడిఎస్ సిడిపిఓ శ్రీలత మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి స్కూల్ కు వచ్చే పిల్లల పెరుగుదల, అంగన్వాడి కేంద్రాలలో పిల్లలకు అందించే పౌష్టికాహారం, ప్రీ స్కూల్ విద్య పట్ల అంగన్వాడి టీచర్లకు స్క్రీన్ పై వివరించి అవగాహన కల్పించారు. అన్ని అంగన్వాడి సెంటర్లలో పోషణ్ భీ. పడాయ్ భీ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. విద్యా సేవల నాణ్యత పెంపొందించడానికి పోషణ్ భీ.పడాయ్ భీ ఎంతగానో దోహదపడుతుందని సిడిపిఓ శ్రీలత సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు షహనాజ్ పర్వీన్,రాధ, ప్రేమలత అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## నూతన జిఎం ను సన్మానించిన సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 16, సూర్య మేజర్ న్యూస్:**

మందమర్రి ఏరియా నూతన జియంగా బాధ్యతలు చేపట్టిన రాధాకృష్ణ కి సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం 7856 ఆధ్వర్యంలో మంగళవారం రోజున ఘనంగా పూల బొకే శాలువా తో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయా సంఘం అధ్యక్షులు ధారావత్ పంతుల నాయక మాట్లాడుతూ ఏరియాలోని సింగరేణి గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. రోస్టర్ పాయింట్ కానీ, పదోన్నతులు, గానీ క్వార్టర్ల విషయంలో పలు విషయాలపై రాతపూర్వకంగా వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధ్యక్షులు రాము, లైజైనింగ్ ఆఫీసర్ బాబు జాదవ్, ఏరియా గౌరవ అధ్యక్షులు డీజిఎం దూప్ సింగ్ సింగ్ఏరియా సర్వే డివైజియం భూక్యా దేశాయ్, ఏరియా జనరల్ సెక్రటరీ ధరావత్ తిరుపతి,ఏరియా వైస్ ప్రెసిడెంట్ రాంబాబు, ఆర్గనైజర్ సెక్రెటరీ బి ప్రవీణ్, ట్రెజరీ మూడు బాలకృష్ణ, కాజీపేట టు పిట్ సెక్రటరీ బోడ కాసీం మరియు రవి, రాజ్ కుమార్, కిషన్, రాజశేఖర్ మొదలైన పాల్గొన్నారు

## ఆయన కళ్ళు సజీవం...

**- మరణించినా జీవిస్తున్న జంగపల్లి రాజారాం.**

**- నేత్రదానం తో ఇద్దరు అందుల జీవితంలో వెలుగులు.**

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 16, సూర్య మేజర్ న్యూస్:**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బుధకుర్దు గ్రామానికి చెందిన జంగపల్లి రాజారాం (69) సంవత్సరాలు ప్రమాదవశాత్తు మరణించగా వారి అల్లుడు జనహిత సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఇప్ప రవి వారి కుటుంబ సభ్యులకు నేత్రదానం గురుంచి వివరించగా వారి కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖం లో ఉండి నేత్రదానం ద్వారా ఇద్దరు



జీవితాల్లో వెలుగులు నింపాలని భావించి నేత్రదానం కి అంగీకరించడంతో సదశయా ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్ సహకారంతో ఎల్.వి ప్రసాద్ ఐ బ్యాంక్ సిబ్బంది సతీష్ నేత్రాలని స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ జంగపల్లి రాజారాం కుటుంబ సభ్యుల స్ఫూర్తితో మరణించిన తరువాత నేత్ర, అవయవ,శరీరాలు కాల్చి బూడిద అయి వృధా కాకుండా దానం చేసి సమాజానికి ఉపయోగపడాలని నేత్రదానం చేసినపుడు మరణించిన తరువాత ఎనిమిది గంటల లోపు మరణించిన వ్యక్తి యొక్క కళ్లలోని కార్నియా పొరని మాత్రమే సేకరిస్తారని నేత్ర దానం ద్వారా ఇద్దరు అందులకి చూపు ప్రసాదించి వారి ద్వారా మరణించినా ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం ఉందని అన్నారు. వ్యక్తి బ్రెయిన్ డెడ్ అయినప్పుడు వారి అవయవాలు దానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో అవయవాలు అవసరం ఉన్న ఎనిమిది మంది ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని అలాగే శరీర దానం ద్వారా పార్థివ దేహాన్ని వైద్య కళాశాల కి అందించి కొన్ని వేల వైద్య విద్యార్థుల బోధనకు ఉపయోగపడి ప్రజల వైద్య చికిత్స కి ఉపయోగపడే అవకాశం ఉందని ప్రజలందరూ అపోహలు వీడి నేత్ర, అవయవ, శరీర దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. జనహిత సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఇప్ప రవి గతంలో వారి తల్లి నేత్రాలని మరియు ఇప్పుడు వారి మామయ్య నేత్రాలని దానం చేసేందుకు కృషి చేసి ఆదర్శంగా నిలిచారని, నేత్రదాత జంగపల్లి రాజారాం కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వీరి స్ఫూర్తితో ప్రజలు మరింత నేత్రదానం కొరకు ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కాంపెల్లి విజయ్ కుమార్ మరియు కుటుంబ సభ్యులు బంధు మిత్రులు పాల్గొన్నారు.

## ఫీజు రియంబర్స్మెంట్ నిధులు, జూనియర్ కళాశాల మంజూరు చేయాలి

### - లేకుంటే రానున్న ఎలక్షన్లో విద్యార్థుల శక్తి ఏంటో చూపిస్తాం - బిఆర్ఎస్వి జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 16, సూర్య మేజర్ న్యూస్:**

పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ నిధులు మరియు తాండూరు మండలంలో జూనియర్ కళాశాల మంజూరు చేయకపోతే రానున్న ఎలక్షన్లో విద్యార్థుల శక్తి ఏంటో చూపిస్తాం అని తాండూరు మండలంలో ప్రధాన రహదారిపై బిఆర్ఎస్వి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ అద్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్వి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బడికల శ్రావణ్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం వల్ల ఎంతో మంది విద్యార్థులు నష్టపోతున్నారని, విద్యార్థులు తల్లిదండ్రులు రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి ఉందని, అలాంటి విద్యార్థులు మేనేజ్మెంట్ ఫీజులు




భరించకపోవడం వల్లనే స్కాలర్షిప్ పై ఆధారపడి ఎంతోమంది విద్యార్థులు చదువుకుంటున్నారని, ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల స్కాలర్షిప్ విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, విద్యార్థులను అరిగోసలు పెడుతున్నారని అన్నారు. అదేవిధంగా ఇంటర్, మరియు ఉన్నత విద్యాసంస్థలైనటువంటి డిగ్రీ, పిజీ ఎంబీబీఎస్, ఎంబీఏ, ఫార్మసీ, బిఈడి, ఇంజనీరింగ్ విద్యాసంస్థలు, వృత్తి విద్య కోసం సంబంధించిన విద్యాసంస్థలు అన్ని కూడా ఏక తాటిపైకి వచ్చి స్కాలర్షిప్ విడుదల అయ్యేంతవరకు కళాశాలలు మూసివేస్తామని చెప్తున్నారు. అంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా స్పష్టంగా కనిపిస్తోంది అని అన్నారు. అంతేకాకుండా విద్యార్థులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని మరియు ఇక్కడ ఎన్నికల సమయంలో తాండూరు మండలానికి జూనియర్ కళశాల తీసుకువస్తాను అని మాయ మాటలు అబద్దపు హామీ ఇచ్చిన మరిచిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఇప్పటి వరకు కళాశాల మాట ఎత్తకపోవడం వలన ఈ మండలంలోని ఎంతో మంది విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరం అవుతున్నారు అని, ఎంతో మంది పేద విద్యార్థుల చదువుకు దూరం అయి ఎటు కాకుండా పోతున్నారనీ వారు ఆవేదన చెందారు వెంటనే ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఇచ్చిన హామీ మేరకు జూనియర్ కళశాల ప్రారంభించక పోతే నియోజకవర్గ వ్యాప్తంగా పెద్దఎత్తున దశలవారీగా కార్యక్రమాలు నిర్వహించి, జిల్లాలో ఉన్న ప్రతి ప్రభుత్వ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, అదే విధంగా రానున్న ఎలక్షన్ లో విద్యార్థుల సత్తా ఏంటో చూపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి తాండూరు మండల అధ్యక్షులు శ్రీకాంత్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు ఆడెపు అరుణ్, సీనియర్ నాయకుడు క్రిస్టెఫార్, సత్యనారాయణ, చింటూ, కాటం రాకేష్, రిజ్వాన్, చోదన్, ప్రశాంత్, సరిష్, అక్రం, జుబేర్, ఇమానుఎల్, కైఫ్, జడి పోశం, రంజిత్, శివ శంకర, చరణ్, వినయ్, కుమార్ బిఆర్ఎస్వి కార్యకర్తలు పాల్గొన్నారు.

## అటవీ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**సారంగాపూర్,సెప్టెంబర్ 17, సూర్య మేజర్ న్యూస్**

అటవీ అమరవీరుల త్యాగాలు మరవలేని అని జిల్లా అటవీ అధికారిని నాగిని భాను అన్నారు. మండలంలోని చించోలి (బి )అర్బన్ పార్క్ లో అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అమరవీరులకు ఘన నివాళులు అర్పించినట్లు ఆమె తెలిపారు.అటవీ పరిరక్షణలో అసువులు బాసిన అమరవీరుల సేవలను కొనియాడారు,సేవలను స్మరిస్తూ వారి కుటుంబ సభ్యులను సన్మానించారు.అటవీ పరిరక్షణలో ఎదురయ్యే సవాళ్లను, చట్టానికి లోబడి సమయస్ఫూర్తితో విధులు నిర్వర్తించాలని ఆమె సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ లు రామకృష్ణారావు,అనిత,రాథోడ్ రమేష్,రాథోడ్ అవినాష్,డిప్యూటీ ఎఫ్ఆర్ఓ లు ఎండి నజీర్ ఖాన్, సంతోష్ కుమార్,రాజశేఖర్, ఇర్ఫానుద్దీన్, జిల్లా అటవీ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## కుమ్రం భీం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

**కెరెమెరి,సెప్టెంబర్ 16,సూర్య మేజర్ న్యూస్ :**

ఆదివాసీల ఆరాధ్య దైవం కుమ్రం భీం 85వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం జిల్లాలోని కెరెమెరి మండలం జోడేఘాట్ లో కుమ్రం భీం 85వ వర్ధంతిని పురస్కరించుకొని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ, జిల్లా ఎస్.పి. కాంతిలాల్ సుభాష్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసన





సభ్యులు కోవ లక్ష్మి, ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి హెలిప్యాడ్, వర్ధంతి, దర్బార్ ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేసి కుమ్రం భీమ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో జిల్లా కలెక్టర్మా ట్లాడుతూ కుమ్రం భీం వర్ధంతి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. అక్టోబర్ 7న నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, జోడేఘాట్ లో శాశ్వత సభ వేదిక నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. భద్రత దృష్ట్యా సి.సి. కెమెరాలను ఏర్పాటు చేయాలని, వేడుకలకు వచ్చే ప్రజలకు భోజనం, త్రాగునీరు ఏర్పాటు చేయాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలని, హట్టి నుండి జోడేఘాట్ వరకు అవసరమైన బస్ లను నడపాలని ఆర్.టి.సి. అధికారులను ఆదేశించారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ద్వారా గిరిజనులకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై శాఖల వారిగా స్టాళ్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. గిరిజన ప్రజల సమస్యల ధరఖాస్తులను నమోదు చేసుకునేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తామని, దర్బార్ లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. వర్ధంతి వేడుకలో పాల్గొనేందుకు రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలతో పాటు చత్తీస్ గడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో గిరిజనులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఆసిఫాబాద్ శాసన సభ్యులు మాట్లాడుతూ జల్- జంగల్ - జమీన్ కోసం పోరాడిన కుమ్రం భీమ్ స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసి గ్రామాలు, గూడాలలో నివాస గృహాలు, త్రాగునీటి పనులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. వర్ధంతి వేడుకలలో భాగంగా పార్కింగ్ కొరకు వినియోగించే వ్యవసాయ భూమికి నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, జోడేఘాట్ ఆశ్రమ



పాఠశాల విద్యార్థులకు, స్థానిక గిరిజన ప్రజల కొరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను నిర్మించాలని తెలిపారు. టూరిజం ఏర్పాటు చేయాలని, వర్ధంతి ఉత్సవానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అందరి సహకారంతో వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎ. ఎస్. పి. చిత్తరంజన్ ఈ.ఈ. తనాజీ, అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి కుడ్మేత మనోహర్, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు పెందోర్ రాజేశ్వర్, రాయి సెంటర్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన తహసిల్దార్ ను సన్మానించిన ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు

**చింతలమానేపల్లి, సెప్టెంబర్ 16, సూర్య మేజర్ న్యూస్**

మండలానికి నూతనంగా వచ్చిన తహసీల్దార్ దామెర వెంకటేశ్వర్ రావును చింతలమానేపల్లి మండల ఎం.ఆర్.పి.ఎస్ నాయకుల ఆధ్వర్యంలో మర్యాద



పూర్వకంగా కలసి సన్మానించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండి, సేవభావంతో న్యాయంగా విధులు నిర్వహించి మంచి పేరు ప్రతిష్టలు పొందాలని ఆశభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చింతలమానేపల్లి ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు బాబు జాగ్ జీవన్ రామ్ మండల అధ్యక్షులు గోగార్ల పోచయ్య, గౌరవ అధ్యక్షులు నందిపేట రామయ్య, ఉపాధ్యక్షులు తోటపల్లి సాలయ్య, మండల మాజీ అధ్యక్షులు గోలేటి శంకర్, ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు ఇప్ప శ్రీనివాస్, ఇప్ప శంకర్, ఇప్ప నారాయణ, ఇప్ప తులసిరామ్, కంబాల విలాస్, గోలేటి సతీష్, గోలేటి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## సుజాత, సాజిత్ ఖాన్ పై సస్పెన్షన్ ఎత్తివేత

**ఆదిలాబాద్ ,సెప్టెంబర్ 16,సూర్య మేజర్ న్యూస్**

కాంగ్రెస్ పార్టీ యందు గత కొన్ని సంవత్సరాల నుండి అహర్నిశలుగా కృషి చేస్తూ కొన్ని అనివార్య కారణాల చేత బహిష్కరణకు గురై తిరిగి అధిష్టానం యొక్క పిలుపుమేరకు తిరిగి పార్టీలోనే కొనసాగే విధంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో గంద్ర సుజాత మరియు అల్లూరి సంజీవరెడ్డితో పాటు సాజిత్ ఖాన్ కాంగ్రెస్ పార్టీలో చేరికైనట్లుగా అధిష్టానం భావించింది ఇకనుండి జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తూ పార్టీ యొక్క పునర్ వైభవంలో తమ వంతు పాత్రను పోషిస్తామని తెలియపరిచారు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంతోషాన్ని వ్యక్తం చేశారు కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంబకంటి అశోక్, సంజయ్ దూబే,సంతోషం

## నూతన తహసీల్దార్ ను మర్యాద పూర్వకంగా కలిసిన మీ సేవ నిర్వాహకులు

**సారంగాపూర్,సెప్టెంబర్ 16,సూర్య మేజర్ న్యూస్**

సారంగాపూర్ మండల నూతన తహసిల్దార్గా బాధ్యతలు చేపట్టిన సంధ్యారాణిని మంగళవారం మీసేవ నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మీ సేవ నిర్వాహకులు శివ ప్రసాద్ గౌడ్,కైసర్,మహేందర్,భూమేష్,సందీప్, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సంతోష్ కుమార్ ను సన్మానించిన తేజపూర్ గ్రామ పెద్దలు

నేరడిగొండ సెప్టెంబర్ 16. సూర్య మేజర్ న్యూస్. మండలంలోని తేజాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులైన సంతోష్ కుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందినందుకు తేజాపూర్ గ్రామస్తులు వీడీసీ సభ్యులు అలాగే జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మణి లత ఉపాధ్యాయులు కలసి సంతోష్ కుమార్ను ఘనంగా సన్మానించారు. అలాగే తేజాపూర్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బద్దం భూమారెడ్డి పాఠశాలకు టీవీని రేకుల షెడ్ తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. గతంలో తేజాపూర్ ప్రధానోపాధ్యాయులు గా పనిచేసి విద్యార్థిని విద్యార్థులకు క్రమశిక్షణ నేర్పిన గురువుగా పేరు తెచ్చుకున్నారు. ఆయనను ఉపాధ్యాయులు వీడీసీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సంతోష్ కుమార్ మాట్లాడుతూ తేజాపూర్ ప్రాథమిక పాఠశాలకు రావడం అదృష్టం అన్నారు. పాఠశాలకు సహకరించిన వీడీసీ సభ్యులకు గ్రామస్తుల కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయుడు బద్దం భూమ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల అన్ని సౌకర్యాలతో ఆనందంగా ఉందని పాఠశాల మారిందని అన్నారు.ఈ సన్మాన కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ప్రఫుల్ చందర్ రెడ్డి, బాదల శ్రీనివాస్, వాంకిడి లింగారెడ్డి, అల్లూరి నరసింహారెడ్డి, పద్మనాభ రెడ్డి, గజ్జల అశోక్, గంగాధర్, హనుమంతు ఉపాధ్యాయులు శ్రీనివాస్ గౌడ్ పవన్ తదితరులు పాల్గొన్నారు





# కర్ణాటకలో బంగారం, రాగి అన్వేషణకు సింగరేణికి లైసెన్సు పత్రాల అందజేత

**- కేంద్రమంత్రి జి కిషన్ రెడ్డి చేతుల మీదుగా లైసెన్స్ పత్రాలు స్వీకరించిన సింగరేణి సీఎండీ బలరామ్**

**మందమర్రి, సెప్టెంబర్ 16, సూర్య మేజర్ న్యూస్.**






కర్ణాటక రాష్ట్రంలోని దేవదుర్గ ప్రాంతంలో బంగారం, రాగి ఖనిజాల అన్వేషణ చేయడానికి సింగరేణి సంస్థకు అనుమతిస్తూ జారీచేసిన లైసెన్సులను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ కు అందజేశారు. మంగళవారం హైదరాబాద్ లోని టీ హబ్ లో కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో జరిగిన కీలక ఖనిజాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సెమినార్ లో వీటిని అందజేశారు. గత మార్చి నెలలో కేంద్ర గనుల శాఖ నిర్వహించిన కీలక ఖనిజాల వేలంపాటలో సింగరేణి సంస్థ పాల్గొని 37.75 శాతం రాయల్టీతో కర్ణాటక రాష్ట్రంలోని దేవదుర్గ ప్రాంతంలో 199 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో గల బంగారం, రాగి ఖనిజాల అన్వేషణ పనిని దక్కించుకుంది. దీనికి సంబంధించిన లైసెన్సు, సర్టిఫికెట్లను మంగళవారం కేంద్ర మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి మాట్లాడుతూ కీలక ఖనిజ రంగంలో భారతదేశాన్ని స్వయం సమృద్ధిగా మార్చడం కోసం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు కృషి చేయాలన్నారు. దేశంలో కీలక ఖనిజ రంగం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 32 వేల కోట్ల రూపాయలను కేటాయించిందన్నారు. కీలక ఖనిజాల అన్వేషణకు వేలంపాటలో విజేతలైన వారికి ఆయన అభినందనలు తెలియజేశారు. వెంటనే అన్వేషణ పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డిపార్ట్మెంట్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ శాఖ డైరెక్టర్ వల్లూరు క్రాంతి, సింగరేణి డైరెక్టర్ (పి.పి) కె వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ కో-ఆర్డినేషన్ మార్కెటింగ్ తాడబోయిన శ్రీనివాస్, జనరల్ మేనేజర్ ఎక్స్ప్లోరేషన్ శ్రీనివాసరావు, జనరల్ మేనేజర్ ఆర్ అండ్ డి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## కడ్తాల్ పెద్ద చెరువుకు గండి

**- వృధాగా పోతున్న చెరువు నీళ్లు**

**సోన్, సెప్టెంబర్ 16 సూర్య మేజర్ న్యూస్:**

మండలంలోని కడ్తాల్ గ్రామ సమీపంలో గల పెద్ద చెరువు కట్ట మంగళవారం తెగిపోయింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో చెరువు తూము వద్ద కట్ట బలహీనంగా మారింది. దీనికి తోడు సోమవారం రాత్రి కురిసిన వర్షానికి తూము వద్ద బుంగ ఏర్పడి కట్ట పూర్తిగా తెగిపోయింది. దీంతో



చెరువులోని నీరంతా దిగువన ఉన్నా పంట పొలాల్లోకి వెళ్తున్నాయి. గ్రామస్తులు వెంటనే నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. గత ప్రభుత్వంలో రూ. 78 లక్షలతో మిషన్ కాకతీయ కింద చెరువు పూడికతీత పనులు చేపట్టినప్పటికీ కట్టను పటిష్టం చేయలేదు. భారీగా కురిసిన వర్షానికి చెరువు పూర్తిగా నిండుకొని తెగిపోయి రైతులకు నష్టం చేకూర్చిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖ ఈ ఈ అనిల్ ఏఈ మధుకర్ ను వివరణ కోరగా,రాత్రి కురిసిన వర్షంతో భారీగా చెరువులోకి నీరు వస్తుందని, వరద ఉధృతి తగ్గిన వెంటనే గండిని పూడ్చి వేస్తామని తెలిపారు. అంతకుముందు మండల తాహసిల్దార్ మల్లేష్ రెడ్డి గండిని పరిశీలించారు.

## నూతన జీపీవోలకు పదవి బాధ్యతలు

**దస్తురాబాద్, సెప్టెంబర్ 16 సూర్య మేజర్ న్యూస్ :**

మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బత్తుల విశ్వంబర్ ఆధ్వర్యంలో నూతన జీపీవోలుగా లావణ్య, కవిత, నర్సయ్య లు బాధ్యతలు చేపట్టారు.నూతన జీపీవో లకు,బదిలీ పై వెళ్తున్న జీపీవోలు అయినా




అబిలాష్,అశోక్ లను తహసీల్దార్ శాలువా తో సన్మానం చేశారు.ఉద్యోగంలో బదిలీలు సహజం అని,ఎక్కడ పని చేసిన బాధ్యతగా పని చేయాలనీ సూచించారు.ఇందులో నయాబ్ తహసీల్దార్ యాదవరావు,సీనియర్ అసిస్టెంట్ సంతోష్,రెవిన్యూ ఇన్స్పెక్టర్ రచన,జూనియర్ అసిస్టెంట్ లు సూరజ్ కుమార్,మధు, మొయిజ్,ఏ ఎస్ ఓ సంతోష్,భూ భారతి ఆపరేటర్ వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## దివ్యాంగుల గుర్తింపు ప్రధానం

**నిర్మల్ ప్రతినిధి , సూర్య మేజర్ న్యూస్.**





జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రత్యేక ఉపాధ్యాయులకు ప్రశస్త యాప్ మరియు దివ్యాంగ విద్యార్థులకు అందించే ప్రోత్సాహకాలపై నిర్మల్ అర్బన్ మండలం లోని జుమ్మేరాత్ పేట్ ఉన్నత పాఠశాలలో ఒకరోజు శిక్షణ శిబిరం నిర్వహించబడింది. ఇందులో పాల్గొన్న జిల్లా విలీన విద్యా సమన్వయకర్త. ఎన్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1830 మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నారని, వీరందరికీ అవసరమైన ఉపకరణాలు, ప్రోత్సాహకాలు అందించడం కోసం కృషి చేస్తున్నామని, అదేవిధంగా ప్రశాస్త యాప్ ద్వారా ఇంకా పాఠశాలలోని దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలియజేశారు. విద్యార్థుల్లో ప్రోత్సాహకాలకు అర్హులు అయిన దివ్యాంగ విద్యార్థులను గుర్తించి, వారికి బ్యాంక్ అకౌంట్లోను తీయించి, ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. అదేవిధంగా ప్రశాస్త యాప్ గురించి అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు అవగాహన కల్పించి వారి ద్వారా దివ్యాంగ విద్యార్థులను గుర్తించే ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవిబాబు, ఆర్ పి లు రాజశేఖర్, విటల్ మరియు ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

## ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ వేడుకలు

**-ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ మోటివేషన్ స్పీకర్ వాడేకర్ లక్ష్మణ్.**

**భైంసా,సెప్టెంబర్ 16,సూర్య మేజర్ న్యూస్**

భైంసా పట్టణంలోని జి.ఆర్.పి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన విద్యార్థులకు ఘన స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ పార్టీ మరియు ఓజోన్ డే కార్యక్రమాలను అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ కర్రోళ్ల బుచ్చయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ మరియు ఆనందిత ఫౌండేషన్ చైర్మన్ వాడేకర్ లక్ష్మణ్ హాజరై విద్యార్థులను ఉత్తేజపరిచారు.కార్యక్రమం ప్రారంభంలో ఓజోన్ డే సందర్భంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే ప్రెజెంటేషన్లు ఇచ్చారు. ఓజోన్ పొర రక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమం పర్యావరణ సంరక్షణ పట్ల విద్యార్థులలో బాధ్యతను పెంపొందించేలా రూపొందించబడింది.తదనంతరం జరిగిన ఫ్రెషర్స్ పార్టీలో విద్యార్థులు ఆటపాటలు, నృత్య ప్రదర్శనలతో సందడి చేశారు. వారి ప్రదర్శనలు హాజరైన వారిని ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ఉత్సాహభరితమైన పాల్గొనడం కార్యక్రమానికి మరింత రంగును జోడించింది.ముఖ్య అతిథి శ్రీ వాడేకర్ లక్ష్మణ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ప్రస్తుత సమాజంలో చదువుతో పాటు నైపుణ్యాల అభివృద్ధి చాలా ముఖ్యం. భవిష్యత్తులో నైపుణ్యాలకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. సమయాన్ని సద్వినియోగం చేసుకొని, పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకొని, క్రమశిక్షణతో ముందుకు సాగాలి. తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవం చూపాలి. డ్రగ్స్ వంటి హానికరమైన అలవాట్లకు దూరంగా ఉండి, జీవితంలో ఉన్నత స్థానాన్ని సాధించాలి" అని ప్రేరణాత్మకంగా మాట్లాడారు. యువత డ్రగ్స్‌కు బానిసై జీవితాలను నాశనం చేసుకోవడం ద్వారా తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.కళాశాల ప్రిన్సిపల్ శ్రీ కర్రోళ్ల బుచ్చయ్య మాట్లాడుతూ, "కష్టపడి చదివితేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చు. విద్యార్థులు తమ భవిష్యత్తును స్వయంగా నిర్మించుకోవాలి. ఆత్మవిశ్వాసంతో, క్రమశిక్షణతో ముందుకు సాగితే ఏ లక్ష్యమైనా సాధించవచ్చు" అని విద్యార్థులను ఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్, ప్రొఫెసర్లు, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు విస్తృతంగా పాల్గొన్నారు. కళాశాల ఆవరణ ఉత్సవ వాతావరణంతో కళకళలాడింది. విద్యార్థులు, అధ్యాపకుల సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## విద్యుత్ తీగల పునరుద్ధరణ అభినందనీయం

**ఖానాపూర్ టౌన్ సెప్టెంబర్ 16 సూర్య మేజర్ న్యూస్**

ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామంలోని విద్యుత్ స్తంభాల నుండి గత కొన్ని సంవత్సరాల క్రితం అధికారులు తొలగించిన విద్యుత్ తీగలను ప్రస్తుత ఏఈ రామ్ సింగ్ పునరుద్ధరించడం అభినందనీయమని ఎం.సి.పి.ఐ.యు నిర్మల్ జిల్లా కార్యదర్శి అల్లెపు పీటర్, అఖిలభారత మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి స్వరూప, ఎం సి పి ఐ యు కడెం మండల కార్యదర్శి హైమద్ అన్నారు. సమస్యను పరిష్కరించిన రాం సింగ్ కు వారు ధన్యవాదములు తెలిపినారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అంజయ్య

**ఖానాపూర్ టౌన్ సెప్టెంబర్ 16 సూర్య మేజర్ న్యూస్**

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా మస్కాపూర్ ఉన్నత పాఠశాల కు చెందిన తెలుగు భాషా పండితులు వెన్నం అంజయ్య ఎంపికైనారు. బుధవారం రోజు మధ్యాహ్నం సిటీ ఫంక్షన్ హాల్ నిర్మల్‌లో జరిగే అవార్డుల ప్రధానోత్సవంలో ఈయన అవార్డు తీసుకోనున్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఈయనను ప్రధానోపాధ్యాయులు బోనగిరి నరేందర్, ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది అభినందిచారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో

## శస్త్ర చికిత్స సేవలు వినియోగించుకోగలరు

**- మంచిర్యాల డి సి హెచ్ ఎస్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం కోటేశ్వర్**

లక్షెట్టిపేట, సెప్టెంబర్ 16,సూర్య మేజర్ న్యూస్ :

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసూతి సేవలతో పాటు ఇకనుండి శస్త్ర చికిత్స సేవలు అందనున్నాయని మంచిర్యాల డి సి హెచ్ ఎస్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం కోటేశ్వర్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి మాట్లాడారు. గత కొన్ని నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పట్టుదలతో ప్రారంభించబడిన ఆసుపత్రిలో మొదటి సరిగా శస్త్ర చికిత్స జరగడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఆపరేషన్ జరిగిన వ్యక్తులు పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జ్ అవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆపరేషన్ చేసిన గైనకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి ని అభినందించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, కలెక్టర్ కుమార్ దీపక్ ల చొరవతో గైనకాలజీ సేవలతో పాటు ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. దండేపల్లి మండలానికి చెందిన లక్ష్మీ అనే గర్భిణి స్త్రీ , శుక్రవారం, శనివారం అనూష అనే గర్భిణి స్త్రీ లకు శస్త్ర చికిత్స చేయడం వారు పుట్టిన పిల్లలతో పూర్తి ఆరోగ్యంతో ఈరోజు డిశ్చార్జ్ అవడం చాలా ఆనందంగా ఉందన్నారు. గర్భిణీ స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ స్రవంతి, పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ పవిత్ర లతో పాటు అనస్థీషియా డాక్టర్ ఆకుల శ్రీనివాస్ గా మేము ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటామన్నారు. పరిసర ప్రాంత ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్ని రకాల వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మంచిర్యాల డి సి హెచ్ ఎస్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం కోటేశ్వర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆకుల శ్రీనివాస్, గైనకాలజిస్ట్ డాక్టర్ స్రవంతి, పిడియాట్రీషియన్ డాక్టర్ పవిత్ర, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

